RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 289 | సోమవారం, మార్చి 30 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram, Guntur, Nellor, Ongole, kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## కన్నవారికి అండగా ఉండేందుకు

# కొత్త చట్టం

- 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' బిల్లుకు ఆమోదం
- తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీతనం, పర్యవేక్షణ బిల్లు
- 2026 ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఇలాంటి చట్టం లతీసుకొచ్చామని వెల్లడి
- సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారని ఆవేదన
- రాష్ట్రంలోని వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం కోసం



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కుటుంబ వ్యవస్థల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో పెద్దలను నిర్లక్ష్యం చేసే ఘటనలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం "తల్లిదండ్రుల సంరక్షణ – ఉద్యోగుల బాధ్యత బిల్లు"ను రూపొందించింది. ఈ బిల్లును శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ద్వారా ఉద్యోగులు తమ తల్లిదండ్రులను సంరక్షించకపోతే వారి వేతనం నుంచి ఒక భాగాన్ని నేరుగా తల్లిదండ్రులకు అందించే విధానం అమల్లోకి రానుంది.వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చింది : పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారన్న రేవంత్ రెడ్డి, పిల్లలు మాత్రం రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఈ చట్టం తీసుకొచ్చామని అన్నారు. మన దేశంలో బాలలు, వృద్ధులు, వికలాంగుల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, జువైనల్ చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం ఇలా ఎన్నో చట్టాలు తెచ్చామని, వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ. 10 వేలకు మించకుండా ఇవ్వాలని ఉందని, కేంద్ర చట్టం ప్రకారం రూ. 10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదని తెలిపారు. ఈ బిల్లుకు అందరూ మద్దతు ఇవ్వాలి : సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరి స్తున్నారని, ఆత్మీయతకు సంబంధించిన అంశంపై చట్టం తీసుకురావటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అత్తింటికి వెళ్లిన ఆడపిల్లలు తల్లిదండ్రుల బాగోగులు చూడలేని పరిస్థితులు ఉన్నాయని, తాము తెచ్చిన చట్టం ప్రభుత్వ ఉద్యోగులకే కాదని, ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను చూసుకోలేనోడు – సమాజంలో బతకడానికి వీల్లేదని అన్నారు. సామాజిక బాధ్యతగా ఈ చట్టాన్ని తీసుకువచ్చామని, అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సీఎం ప్రసంగం అనంతరం తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

"పిల్లలు మాత్రం రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదు వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే చట్టం తీసుకొచ్చాం. మనదేశంలో బాలలు, వృద్ధులు, వికలాంగుల కోసం అనేక చట్టాలు ఉన్నాయి. జువైనల్ చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం ఇలా ఎన్నో చట్టాలు తెచ్చాం. వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చింది. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ. 10 వేలకు మించకుండా ఇవ్వాలని ఉంది. కేంద్ర చట్టం ప్రకారం రూ. 10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదు. మేం తెచ్చిన చట్టం ప్రభుత్వ ఉద్యోగులకే కాదు. ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుంది. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలి. తల్లిదండ్రులను చూసుకోలేనోడు సమాజంలో బతకడానికి వీల్లేదు. సామాజిక బాధ్యతగా ఈ చట్టాన్ని తీసకువచ్చాం, అందరూ మద్దతు ఇవ్వాలి" – రేవంత్ రెడ్డి, సీఎం

## తెలంగాణ అసెంబ్లీలో

# గందరగోళం

**హైదరాబాద్, మార్చి 29:** తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ నేతలు సభలో నిరసనలు చేపట్టారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. విపక్షాల నినాదాల మధ్యే ప్రభుత్వం 2 బిల్లులు ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ నేతలు సభలో గందరగోళం సృష్టించటంపై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ అంశంపై ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. సీఐడీ దర్యాప్తునకు ఆదేశించిన తర్వాత హౌస్ కమిటీ ఎందుకు? అని ప్రశ్నించారు.సీఐడీ కంటే పెద్ద సంస్థ ఉంటుందా? అని కూడా మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎవరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ దగ్గర ఆధారాలు ఉంటే సీఐడీకి ఇవ్వొచ్చని అన్నారు. నిరసనలతో సభను అడ్డుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ. .'తల్లిదండ్రుల సంరక్షణ కోసం బిల్ పెడుతున్నాం. తల్లిదండ్రులపై బాధ్యత ఉండాలని బిల్ పెడుతు న్నాం. సభ సజావుగా నడవకుండా బీఆర్ఎస్ సభ్యులు అడ్డుకుంటున్నారు.




తల్లిదండ్రుల సంరక్షణ బీఆర్ఎస్ సభ్యులకు అవసరం లేదా?' అని మంత్రి ప్రశ్నించారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పిన బీజేపీ ఎమ్మెల్యేరాఘువ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై ప్రభుత్వం సీఐడీ దర్యాప్తునకు ఆదేశించినందుకు బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. సీఐడీతో పాటు హౌజ్ కమిటీ కూడా వేయాలని కోరారు. లేదంటే బీఆర్ఎస్ నేతలు గొడవ చేస్తారని, మీరు బిల్లు అమోదం తెలుపుకుంటారని అన్నారు. దీంతో ప్రజలకు ఎలాంటి లాభం ఉండదని చెప్పుకొచ్చారు.

# బ్లాక్‌మెయిల్

## రాజకీయాలు చేస్తున్నారు

**- బీఆర్ఎస్ నేతలపై భట్టి విక్రమార్క ఫైర్**

**హైదరాబాద్, మార్చి 29:** బీఆర్ఎస్ నేతలు బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. నాయకులను బ్లాక్‌మెయిల్ చేసి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని అన్నారు. పదేళ్లు హౌస్ కమిటీ లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ తాము సభను అడ్డుకోలేదని చెప్పారు. నిన్నటి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభను పదే పదే అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు జరగాలనుకున్నట్టు సభ జర గదని స్పష్టం చేశారు.అసెంబ్లీలో భట్టి విక్ర మార్క తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'వృద్ధ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చే బిల్లుపై మాట్లాడమంటే అల్లరి చేస్తున్నారు. స్పీకర్‌కు నోటీస్ ఇవ్వకుండా మంత్రి పేరు తీయడమే తప్పు. సీబీ సీఐడీకి ఇచ్చిన తర్వాత కూడా అల్లరి ఎందుకు. చప్పట్లు కొట్టుకుంటూ సభను అంగడిలా మార్చకండి. గతంలో వేసిన హౌస్ కమిటీలతో ఏం సాధించారు. పదేళ్లలో మీరు వేసిన హౌస్ కమిటీల రిపోర్ట్ సభలో పెట్టారా?. బీజేపీ సలహా మేరకు కాళేశ్వరం విచారణ సీబీఐకి అప్పగిస్తే ఏం జరిగింది. బీఆర్ఎస్ నేతలు సభను జరగనివ్వొద్దన్న ఎజెండాతో వచ్చారు. ప్రజలకు మేలు జరగొద్దని వారు అనుకుంటున్నారు. ధరణి పేరిట అనాడు వందల ఎకరాల భూములను తమ వారి పేర్ల పైకి బదలాయించుకున్నారు. వాటిపై హౌస్ కమిటీ వేయండి' అని అన్నారు.



## కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది

# మీరు వ్యాట్ తగ్గించండి

**హైదరాబాద్ :** ఇజ్రాయెల్, అమెరికా – ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది. ఇదే నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలపై భారం పడకుండా రాష్ట్రాలు కూడా వ్యాట్‌ను తగ్గించుకోవాలి అని బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎల్పీజీ, పెట్రోలు, డీజిల్ నిల్వలపై తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించేందుకు హైదరాబాద్ లోని సీజీఐ టవర్స్‌లో కిషన్‌రెడ్డి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ గ్యాస్ సమస్యలపై వస్తున్న వదంతులను ప్రస్థావించారు.వ్యాట్ ఎందుకు తగ్గించరు : పెట్రోలు, డీజిల్‌పై దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం వ్యాట్ విధిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గత పన్నెండేళ్లగా ఇది 35.20 శాతంగా ఉంటోందని తెలిపారు. గతంలో పాలించిన కేసీఆర్? ప్రజాపాలన అంటూ డప్పు కొట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ దీనిలో ఒక్కపైసా కూడా వ్యాట్‌ను తగ్గించలేదని వెల్లడించారు. మన పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో 31 శాతంగా విధిస్తుండగా, మహారాష్ట్రలో 26 శాతం, కర్ణాటకలో 29 శాతంగా ఉన్నాయని ప్రస్థావించారు. అయితే తెలంగాణలో మాత్రం ఎందుకని 35.20 శాతం విధిస్తున్నారు దీనిని ఎందు తగ్గించండం లేదు అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.ఆందోళన వద్దు : రాష్ట్రంలో పుష్కలంగా ఎల్పీజీ, పెట్రోలు, డీజిల్ నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. చమురు సంస్థలు పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీలకు మూడు రోజుల పాటు క్రెడిట్ సౌకర్యాన్ని ఇస్తున్నారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని ప్రస్థావించారు.లాక్‌డౌన్ వదంతులను నమ్మొద్దు : దేశంలో మళ్లీ లాక్‌డౌన్ విధించనున్నారనే వదంతులను నమ్మొద్దని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి మోదీ లోక్‌సభలో మాట్లాడిన మాటల్లో సారాంశాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా లాక్?డౌన్? విధిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వేల సంఖ్యలో పోస్టు అప్‌లోడ్ చేశారని వెల్లడించారు. మన దేశానికి రావాల్సిన చమురు, గ్యాస్‌ను సకాలంలో తెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా ఈ సమస్యపై పర్యవేక్షిస్తుని తెలిపారు. ప్రజలు ఎల్పీజీ, పెట్రల్ డీజిల్‌లను పొదుపుగా వినియోగించాలని సూచించారు.




### మాజీ కారు డ్రైవర్ కుమారుడికి

## టికెట్ ఇచ్చిన విజయ్



**చెన్నై:** త్వరలో జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆదివారం ప్రకటించారు తమిళగ వెట్రి కజగం(టీవీకే) పార్టీ అధినేత విజయ్. ఈ క్రమంలో టీవీకే అభ్యర్థుల జాబితా రిలీజ్– తన మాజీ కారు డ్రైవర్ కొడుకుకి టికెట్ ఇచ్చిన విజయ్ ఈ క్రమంలో తన మాజీ కారు డ్రైవర్, ప్రస్తుతం పీఏ రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌కు టికెట్ ఇచ్చారు. దీంతో రాజేంద్రన్, అతని కుమారుడు శబరినాథన్ వేదికపైనే కన్నీళ్లు పెట్టుకోగా, విజయ్ వారిని సముదాయించారు. ఆ సమయంలో విజయ్ కూడా కాస్త ఎమోషన ల్ అయ్యారు. కాగా, శబరినాథన్‌కు విజయ్ విరుగంబాక్కం టికెట్‌ను కేటాయించారు.

## మంత్రి పొంగులేటిని

# తొలగించాల్సిందే

**హైదరాబాద్,** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ స్కామ్ బయటపడడంతో ప్రభుత్వం బిత్తరపోయిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అక్రమం జరగడం వాస్తవమేనని ముఖ్యమంత్రి ఒప్పుకున్నా రని, అయినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆ అవినీతిలో తనకు కూడా వాటా ఉన్నందునే ముఖ్యమంత్రి చర్య తీసుకో వడం లేదా అని ప్రశ్నించారు .రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి 2020 నుంచి 2022 వరకు పొంగులేటి చైర్మన్‌గా ఉన్నారని, సీఎం మాత్రం ఆ కంపెనీ పొంగులేటి దూరపు బంధువులదని చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రెండున్నర ఏళ్లుగా ప్రజలకు పనికివచ్చే ఒక పని కూడా చేయలేదని, అవినీతికి పాల్పడిన మంత్రిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, మంత్రి కుటుంబాన్ని ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. మైనింగ్ పేరిట రాష్ట్రంలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. కోకాపేట్‌లోని భాగ్యలక్ష్మి మైనింగ్ ముఖ్యమంత్రి బంధువులదని అన్నారు వేల కోట్ల అవినీతి చేయకపోతే ఎందుకు సభను వాయిదా వేసుకున్నారని కేటీఆర్ ప్రశ్నించారు . 280 ఎకరాలను తమ ప్రభుత్వం ఎల్ అండ్ టీ కంపెనీకి లీజుకు ఇచ్చిందని, ఆ భూమిని కూడా కొట్టేయడానికి దండుపాల్యం బ్యాచ్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఎల్ అండ్ టీ సీఎఫ్ఓను జైలులో వేస్తామని బెదిరించారని అన్నారు. ఇది పెద్ద కుంభకోణమని, ప్రభుత్వం వినకపోతే గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. మంత్రి పొంగులేటిని పదవి నుంచి తొలగించాల్సిందేనని డిమాండ్ చేశారు.



## తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో

# పుట్టిన పార్టీ టీడీపీ



**అమరావతి:** తెలుగుదేశం పార్టీ కేవలం ఒక రాజకీయ శక్తి మాత్రమే కాదని, అది తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో పుట్టిన ఒక గొప్ప వ్యవస్థ అని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు అనేక చారిత్రాత్మక రికార్డులు నెలకొల్పామని ఆయన గుర్తుచేశారు. తెలుగు దేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'సామాన్య కార్యకర్తలను, వెనుకబడిన వర్గాల వారిని గుర్తించి వారిని చట్టసభలకు పంపించిన ఘనత టీడీపీ కే దక్కుతుంది. 'పేదవాడికి పట్టెడన్నం పెట్టాలి.. వారు గౌరవంగా బతకాలి' అన్న నందమూరి తారక రామారావు ఆశయమే పార్టీకి పునాది. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి, వారిని రాజకీయంగా బలోపేతం చేసింది పార్టీ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలు ఇప్పటికీ దేశంలోని అనేక రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచాయి. ఇకపై 'మూడు ముక్కలాట' ఉండదు. ఏపీకి అమరావతి ఒక్కటే రాజధాని. అనుభవంతో, భవిష్యత్తులో అమరావతిని హైదరాబాద్‌ను మించిన ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. రాజధాని అభివృద్ధిని అడ్డుకునే శక్తులను, వ్యతిరేకించే వారిని ఇక్కడకు రాకుండా అడ్డుకోవాలి' అని అన్నారు.

# నా... మాట!

దశాబ్దాల స్వాతంత్ర భారతంలో ఇప్పటికి
పేదరిక నిర్మూలన సాధ్యం కాలేదు..
ప్రభుత్వాలు ఎన్నిమారినా,
శాస్త్ర,సాంకేతిక రంగాలలో ప్రపంచ
దేశాలతో పోటీ పడుతున్న..
సామాన్యుల బతుకులింకా మారలేదు!
నేడు,దిగ్గజాలని చెప్పుకొనే కార్పొరేటు
బిచ్చగాళ్లు,
రాజకీయలా రొచ్చులో తిరిగే ముష్టివాళ్లు,
నా దేశ సంపదను దోచుకొని సిస్
బ్యాంకుల్లో
దాచుకుంటున్నారు..
అభివృద్ధిచెందుతున్న దేశం అంటూనే ఆకలి
కేకలను,ఆకలి చావులను ఆపలేని వ్యవస్థలే,
ఇప్పటి పేదరికపు నీడలను మోస్తుంది..
సచ్చిపోయినా,సాయం కావాలన్నా!
ఆ రంగుల అద్దాలమేడలు ఎప్పటికి
పరాయిదేశాలే..
దేశ స్థాయిలో పేదరికం బాగా తగ్గిందని
నివేదికలా ద్వరా ప్రగల్బాలు పలికే
నాయకులే ఈపాపాలకు కారణం!
ఇప్పటికి,రోడ్లు లేని ఆదివాసీ గ్రామాలు
ఉన్నాయి,కరెంటులేని గిరిజన
తండాలుఉన్నాయి!
78 ఏండ్ల స్వాతంత్ర భారతవానికి
సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి!

పెద్దపల్లి రాజన్న...
9848174314

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## స్పెల్లింగ్ బి పోటీ పరీక్షలో జాతీయ స్థాయికి ఎంపికైన శ్రీవిద్య పాఠశాల విద్యార్థులు



**మెదక్,మార్చి29(హైద్రాబాద్ ఎస్టేట్):** స్పెల్లింగ్ బి రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలో విజయం సాధించి ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాపన్నపేట శ్రీవిద్య పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా తెలిపారు.ఆదివారం నాడు హైదరాబాద్ లోని రామంతాపూర్ లో టీఎస్ గ్రామర్ హైస్కూల్లో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్పెల్లింగ్ బి పోటీ పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షలలో మెదక్ జిల్లా పాపన్నపేట నుండి శ్రీవిద్య పాఠశాల విద్యార్థులు నలుగురు పాల్గొన్నారు.వీరిలో ఫస్ట్ కేటగిరీలో పి.మనోహర్ ప్రథమ బహుమతి శ్రేష్టాక్షర ద్వితీయ బహుమతి, అక్షిత్,కేటగిరి టులో ద్వితీయ బహుమతి సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.సైపో ద్ధిన్ రేసింగ్ స్టార్ గా విజయం సాధించారు.వీరి ఎంపికకు కృషిచేసిన ఉపాధ్యాయులు దుర్గ,విలాస్,జ్యోతిరాజ్ ప్రధాన్,షీలా,అనురాధ, అపూర్వలను పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా,కరస్పాండెంట్ నిటలా క్ృష్ప,సుమన్ లు అభినందించారు.

## మంజీరా నదీ తీరాన వెలసిన మహిమాన్విత క్షేత్రం ఏడుపాయల వనదుర్గా ఆలయం:కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్,మార్చి29(హైద్రాబాద్ ఎస్టేట్స్):** తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన శ్రీఏడుపాయల వనదుర్గామాతను ఆదివారం రోజు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆలయ ఈఓ వీరేశం,ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ
తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లాలో ఏడుపాయల దుర్గా మాత అత్యంత గౌరవనీయమైన మందిరంగా పేర్కొన్నారు.కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతూ ఈప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారన్నారు. మామూలు రోజుల్లో ఒక మాదిరిగా ఉండే భక్తుల రద్దీ ఆదివారాలలో అధిక సంఖ్యలో భక్తులు తాకిడికనుగుణంగా సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.అదేవిధంగా భక్తులకు సౌకర్యాలు ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రతంగా ఉంచడంలో నిర్వాహకుల సేవలను కలెక్టర్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఈవో వీరేశం, సిబ్బంది సూర్య శ్రీనివాస్,అర్చకులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**మెదక్,మార్చి29(హైద్రాబాద్ ఎస్టేట్స్):** మనస్థాపంతో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన ఫిరంగి సత్యనారాయణ (50) కల్లు వ్యాపారం చేస్తూ జీవితం సాగిస్తున్నాడు.కాగా వారం రోజుల క్రితం ఈయన పెద్ద కూతురు ఎంగేజ్ మెంట్ జరిగింది.దీంతో త్వరలో పెళ్లి ఉండ డంతో పెళ్లికి డబ్బులు లేక అప్పు కోసం ప్రయ త్నం చేస్తున్నాడు.అప్పు ఎక్కడ దొరక్కపోవడంతో మనస్థాపం చెందిన అతను శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాక పోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెత కగా ఆదివారం ఉదయం సమయంలో గ్రామ రోడ్డు పక్కన పాడుబడిన రైస్ మిల్లులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని కని పిం చాడు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలో విజేతగా వైష్ణవి




**మెదక్,మార్చి 29(హైద్రాబాద్ ఎస్టేట్):**రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో పాపన్నపేట ఉన్నత పాఠశాలకు చెందిన కరెల్ల వైష్ణవి విజేతగా నిలిచింది. ఈసందర్భంగా ఆదివారం హన్మకొండలో జరిగిన వేడుకలో ప్రముఖ కవి,సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్,రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్ నగదు,మెమెంటో ప్రశంసా పత్రం అందజేశారు.రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్,తెలుగు ఉపాధ్యాయులు అంజాగౌడ్, నాగరాజు,నర్సింలు అభినందించారు.

# మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**– అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్**



**హైదరాబాద్, మార్చి 28:** మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, మహిళా అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, మోటివేషన్ స్పీకర్ నైనా జైస్వాల్ అన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతల అధ్యక్షతన శనివారం నారాయణగూడ లోని పద్మశాలి భవన్ లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను ఘనంగా సత్కరించారు. వివిధ రకాల పోటీలు, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిలువేరు సునీత, మిర్యాల విశ్వరేఖ, బాసాని పద్మ, బండారు లక్ష్మీ, పొట్టబత్తిని అరుణ. వై. వాణి, గడ్డం కీర్తన, కొండబత్తిని కృష్ణా సంతోషి, పులి భువనేశ్వరి, భాగ్యలక్ష్మీ, బొమ్మ ప్రవళిక, వర్ణ లీల, అశ్విత, స్రవంతి, యశోద, డాక్టర్ సమత, అమరావతి, సుజాత, రూపా సదాశివ్, శారద, పవిత్ర వాణి, రచన, రేణుక, విజయ లక్ష్మీ, మాధవి, సంతోషి, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

### సన్మాన గ్రహీతలు

చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ పవిత్ర వాణి, న్యాయవాది రచన వడ్డేపల్లి, బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ సమత, ఎగ్జిబిషన్ సొసైటీ మెంబర్ వనం ఉష, సామాజిక కార్యకర్త బొమ్మ ప్రవల్లిక, లెక్చరర్ చందుబట్ల ప్రమీలాదేవి, షాద్‌నగర్ కౌన్సిలర్ వొగ్గు కీర్తన, మెరైన్ సైంటిస్ట్ పల్లె జ్యోత్స్న, సామాజిక కార్యకర్త బైరి అమరావతి, పోటీ చేసిన కార్పొరేటర్ పున్నా నిర్మలా గణేష్, క్రీడాకారులు అంబటి హాసిని, యూట్యూబర్ వనం సాయిజ్యోతి, యూట్యూబర్ దీపికా నరేష్, సూర్యకళా రెబ్బా, తదితరులను ఘనంగా సత్కరించి అభినందించారు.

# కాకినాడలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఐటీ కార్యాలయం ఘన ప్రారంభం



**కాకినాడ, మార్చి 29:**దళిత--బహుజన హక్కుల సాధనలో డిజిటల్ శక్తిని ఆయుధంగా మలచాలనే లక్ష్యంతో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా( అంబేద్కర్ )ఐటీ కార్యాలయం భానుగుడి సెంటర్, సుభద్ర ఆర్కేడ్‌లో, కాకినాడ లో ఘనంగా ప్రారంభమైంది.పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్టా వరప్రసాద్ ఐటీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించగా, కంప్యూటర్ రూమ్‌ను శ్రీమతి లలిత కొటారి ప్రారంభించారు.
ఈ కార్యాలయం రాష్ట్ర ఐటీ ఇంచార్జ్ డి. మణికంఠ ఆధ్వర్యంలో పనిచేయనుందని డాక్టర్ పిట్టా వరప్రసాద్ తెలిపారు
డిజిటల్ వేదికలపై పార్టీ కార్యకలాపాలను విస్తరించి, ప్రజా సమస్యలను వేగంగా నమోదు చేసి, హక్కుల కోసం సమాచార పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కదలి సత్యమూర్తి, కాకినాడ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా శ్రీనివాస్, రాష్ట్ర న్యాయ విభాగం అధ్యక్షులు గోకులం మూర్తి, పార్టీ మార్కెటింగ్ విభాగం నాయకులు పవన్, అలాగే జిల్లా నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఐటీ కార్యాలయ ప్రధాన లక్ష్యాలుపార్టీ కార్యకలాపాల సమగ్ర డిజిటలైజేషన్‌సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యల ప్రాచుర్యం యువతకు ఐటీ ఆధారిత శిక్షణదళిత--బహుజన హక్కుల డాక్యుమెంటేషన్‌వేగవంతమైన సమాచార ప్రసారం
కాకినాడ నుంచే రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన ఈ ఐటీ కార్యాలయం, భవిష్యత్తులో పార్టీకి సమాచార నాడిగా పనిచేయనుందని డాక్టర్ పిట్టా వరప్రసాద్ తెలిపారు.

# మార్చి 30న లేబర్ బోర్డు ముట్టడి

**– కార్మికుల హక్కుల కోసం భారీ సమీకరణకు పిలుపు**

**– భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఉద్యమం వేగం**



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 29:-**రంగారెడ్డి జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 30న నిర్వహించనున్న లేబర్ బోర్డు ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఎల్బీనగర్ ప్రాంతంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ కార్మిక సంక్షేమానికి సంబంధించిన నిధులు ప్రైవేట్ బీమా సంస్థలకు మళ్లించడం తగదని ప్రభుత్వాలను తీవ్రంగా విమర్శించారు. ఈ నెల 30న లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటాలని కోరారు. గతంలో కార్మిక సంఘాల దీర్ఘకాల పోరాటాల ఫలితంగా వచ్చిన సంక్షేమ పథకాలు ప్రస్తుతం కొత్త కార్మిక చట్టాల పేరిట బలహీనపరచబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా నమోదు చేసుకున్న కార్మికులకు వెంటనే సంక్షేమ పథకాలు అమలులోకి రావాలని, దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయాలని, అనవసర నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, వయోవృద్ధులకు పెన్షన్ అందించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్మిక ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం: ఆదిబట్లలో భారీ వైద్య శిబిరం సక్సెస్

**– మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో**

**– గ్రామస్థులకు ఉచిత పరీక్షలు**






**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 29:-**ఇబ్రహింపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల పరిధిలో ఆదివారం ఆరోగ్య సేవల పండుగలా మారింది. స్థానిక నాయకుడు మర్రి నిరంజన్ రెడ్డి మార్గదర్శకత్వంలో, శ్యామ్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన విశాల వైద్య శిబిరం ప్రజల నుంచి విశేష స్పందన పొందింది.
ఈ సేవా కార్యక్రమాన్ని మర్రి నిరంజన్ రెడ్డి స్వయంగా ప్రారంభించగా, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు తమ బృందంతో కలిసి రోగులను పరిశీలించారు. సాధారణ వైద్యంతో పాటు మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, ఎముకల వ్యాధులపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు అందించారు.ఇందులో భాగంగా 2డి ఎకో పరీక్షలు, వివిధ రక్త పరీక్షలు నిర్వహించబడగా, వైద్య సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందించారు. మొత్తం సుమారు 240 మందికి పైగా స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పరీక్షల అనంతరం అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మర్రి నిరంజన్ రెడ్డి, 35 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని సూచించారు. ముఖ్యంగా రక్తపోటు, షుగర్ వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రోజువారీ వ్యాయామం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యులు, సిబ్బంది, టెక్నీషియన్లు, నర్సింగ్ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజా నాయకులు, యువజన సంఘాలు, గ్రామ పెద్దలు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కల్వకుర్తికి రైల్వే లైన్‌కు గ్రీన్ సిగ్నల్

**- మోదీ చిత్రపటానికి టి. ఆచారి పాదాభివందనం**

**- రైల్వే లైన్ ఆమోదంతో కల్వకుర్తిలో బీజేపీ సంబరాలు**



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 29:-**కల్వకుర్తి నియోజకవర్గం చిరకాల వాంఛ అయిన రైల్వే లైన్ నిర్మాణానికి కీలక ముందడుగు పడింది. డోర్నకల్ నుండి గద్వాల్ వరకు సూర్యపేట, నల్లగొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి మీదుగా సుమారు 296 కిలోమీటర్ల రైల్వే లైన్‌కు సంబంధించిన ఫైనల్ లొకేషన్ సర్వే (ఖీూా) పూర్తి కావడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంట్‌లో ప్రకటించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో బీజేపీ నాయకుడు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాదాభివందనం చేశారు. రైల్వే లైన్ కోసం నిధులు మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ప్రాజెక్ట్‌తో ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

# అనుమతి లేకుండా మద్యం సేవనంపై కఠిన చర్యలు: ఎక్సైజ్ శాఖ హెచ్చరిక



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 29:-** ఇబ్రహీంపట్నం పరిధిలో అనధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో మద్యం వినియోగం, విక్రయం పూర్తిగా నిషేధితమని ఎక్సైజ్ శాఖ అధికారులు గట్టిగా హెచ్చరించారు. ముఖ్యంగా రిసార్ట్లు, ఫార్మ్ హౌస్‌లు, కన్వెన్షన్ హాల్స్ వంటి ప్రైవేట్ ప్రాంగణాల్లో అనుమతులు లేకుండా మద్యం సరఫరా చేయడం లేదా సేవించడం చట్టపరంగా నేరమని స్పష్టం చేశారు.ఎక్సైజ్ సీఐ సీతారామరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహించే ఈవెంట్లలో మద్యం వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్ డి పి ఎల్, డ్యూటీ-ఫ్రీ మద్యం వంటి అనుమానాస్పద సరఫరాల వినియోగం కూడా చట్ట విరుద్ధమేనని పేర్కొన్నారు.ఇంకా, ఈ తరహా ప్రైవేట్ వేడుకల్లో మత్తు పదార్థాల వినియోగం పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన అధికారులు, ఇది ఎక్సైజ్ చట్టం ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని హెచ్చరించారు.ప్రభుత్వ నియమాలను పాటించకుండా వ్యవహరించే వ్యక్తులు, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, చట్టపరమైన శిక్షలు విధించడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.ప్రజలు, ముఖ్యంగా ఈవెంట్ నిర్వాహకులు చట్టపరమైన అనుమతులు పొందిన తర్వాతే కార్యక్రమాలు నిర్వహించాలని, లేకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు సూచించారు.

# అసెంబ్లీ 'మ్యూట్' మోడ్‌లో ప్రభుత్వం.. ప్రశ్నిస్తే టార్గెట్

**- ఇల్లీగల్ మైనింగ్‌పై ప్రశ్నిస్తే 'బ్లాక్‌మెయిల్ పాలిటిక్స్'నా**



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 29:-**తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ "సబితా ఇంద్రారెడ్డి" మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ వ్యవహార శైలి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా మారిందని ఆమె ఆరోపించారు. బయట మాట్లాడితే సభకు రమ్మంటారని, సభకు వెళ్తే మైక్ ఇవ్వకుండా అణిచివేస్తున్నారని మండిపడ్డారు. క్వశ్చన్ అవర్‌లో సమాధానాలు లేవని, జీరో అవర్‌ను టైంపాస్‌గా మార్చారని విమర్శించారు. సాయంత్రం అయ్యే సరికి కీలక బిల్లులను చర్చ లేకుండా పాస్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.ఇల్లీగల్ మైనింగ్ అంశంపై టి. హరీష్ రావు లేవనెత్తిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా, పెనాల్టీ వేసామంటూ తప్పించుకుంటున్నారని అన్నారు. "పెనాల్టీ వేసే బదులు కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై హౌస్ కమిటీ వేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఇక సభలో లేని వ్యక్తుల పేర్లు ప్రస్తావిస్తూ రాజకీయాలు చేయడం సరికాదని, కుటుంబాలను టార్గెట్ చేయడం దుర్మార్గమని తీవ్రంగా స్పందించారు. మంత్రులు ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా కులాన్ని లాగడం బాధాకరమని చెప్పారు. ఏ. రేవంత్ రెడ్డి పై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. ఫిరాయింపులపై సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదమని, గత పాలనపై విచారణ పేరుతో బెదిరింపుల రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

"ప్రజలు అన్నీ గమనిస్తున్నారు... ప్రశ్నిస్తే టార్గెట్ చేయడం, అవినీతి బయటపెడితే మౌనం వహించడం, ఇది ఏ విధమైన పాలన?" అంటూ ప్రభుత్వం పై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# మంచాలలో మహిళల విద్యా వెలుగు

**- ముఖ్య అతిథులుగా మంచాల సర్పంచ్ మానస వినయ్**





**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 29:-**మంచాల మండల కేంద్రంలో గ్రామీణ మహిళల విద్యాభివృద్ధికి దోహదపడే ఉల్లాస్-నవభారత్ సాక్షరత కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు చురుకుగా పాల్గొని తమ విద్యా స్థాయిని అంచనా వేసుకునే పరీక్షలు రాశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మానస వినయ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళల్లో విద్యా చైతన్యం పెంపొందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. చదువు ప్రతి ఒక్కరికీ అవసరమని, ముఖ్యంగా మహిళలు విద్యావంతులైతే కుటుంబం మరియు సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జుమీా రాందాస్, ఏపీఎం శేఖర్, సీసీలు కృష్ణా, చంద్రిక తదితరులు పాల్గొని మహిళలకు మార్గదర్శకత్వం అందించారు. అలాగే వీవోఏలు మరియు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ పరీక్షల ద్వారా మహిళలు తమ సాక్షరత నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని స్థానికులు ఆకాంక్షించారు.

## తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలకు గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో భారీగా తెలుగుయువత కార్యకర్తలు బస్సుల్లో తరలి వెళ్లారు





**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి గుంటూరు :**గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు గారి నేతృత్వంలో జరిగిన వేడుకలకు జిల్లా తెలుగుయువత కమిటీసభ్యులు పెద్దఎత్తున రెండు చోట్ల పాల్గొన్నారు.గుంటూరు పశ్చిమ శాసనసభ్యురాలు గల్లా మాధవి గారి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజావ్యతిరేక విధానాల పైన విరోచికంగా పోరాడి అత్యధిక కేసులు నమోదయిన విభాగంలో గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణను గుంటూరు పశ్చిమ శాసనసభ్యురాలు గల్లా మాధవి గారు దుశ్శాలువతో సత్కరించారు. ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి ,స్వర్ణాంధ్ర 2027, ఆరు గ్యారెంటీలు యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పన ఒక్క ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమని , అమరావతి ఏకైక రాజధాని గా శాసనసభ ఏకగ్రీవ తీర్మానం పంపటం పట్ల రావిపాటి సాయి కృష్ణ హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ గారికి, ఐటి విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారికి కృతజ్ఞతలు తెలియజేసారు.

# రోడ్డు నియమాలు పాటించాలి..



**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి) :**అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రతఅవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు మద్దిరాల పోలీస్ స్టేషన్ పరిధి మద్దిరాల మండల కేంద్రంలో వాహనదారులకు స్థానిక ప్రజలకు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని మద్దిరాల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. క్రమానికి డీఎస్పీ ప్రసన్న కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై రోడ్డు భద్రత పట్ల ప్రజలకు సూచనలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నివారించడం రోడ్డు ప్రమాదాలలో ఏ ఒక్కరు కూడా మరణించకూడదని సంకల్పంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల భద్రత పట్ల రోడ్డు భద్రత పట్ల ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. ప్రజలందరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆటోలపై పరిమితికి మించి ప్రయాణికులను రవాణా చేయకూడదని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలలో పెద్దదిక్కుని కోల్పోతే కుటుంబ సభ్యులు దిక్కుతోచక ఉంటున్నారని ఇలాంటి సందర్భాలు చాలా నమోదవుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రయాణ సమయంలో ఏ ఒక్కరు కూడా ప్రాణాలు కోల్పోకూడదని పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యం అని అన్నారు. కావున వాహనదారులు ప్రజలు ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని. వేగంగా వాహనాలు నడపకూడదని మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని సూచించారు ఈ కార్యక్రమంలో ఎస్ ఐ వీరన్న మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మద్దిరాల పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన.... డిఎస్పి ప్రసన్నకుమార్



**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి ) :**ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వేగవంతమైన పోలీస్ సేవలను అందించాలని కేసులు పెండింగ్ ఉండకుండా సరితెగతిన పరిశీలించి ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న పలు రికార్డులను తనిఖీ చేసి సలహాలు సూచనలు అందించారు. సామాజిక అంశాల పట్ల ప్రజలలో చైతన్యం కల్పించడానికి పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువ కావాలని అన్నారు.

అనంతరం మద్దిరాల మండల కేంద్రంలో స్థానిక ప్రజలతో మాట్లాడి సామాజిక అంశాలు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, సైబర్ మోసాల నివారణ, డ్రగ్స్ గంజాయి నిర్మూలన, సామాజిక భద్రత పౌరుల బాధ్యత అంశాల పట్ల అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డిఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణ సమయంలో నియమ నిబంధన పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలపై పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం ప్రయాణికులను రవాణా చేయడం వల్ల వాహనం అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం ప్రమాదమని పిల్లలకు వాహనాలు ఇచ్చినట్లయితే అవగాహన లోపంతో వేగంగా వాహనాలను ప్రమాదాలకు గురవుతూ ఇతరులను ప్రమాదాలకు గురి చేస్తారని తెలిపారు. పెద్ద వాహనదారులు ప్రయాణ సమయంలో జంక్షన్లు, ప్రమాదాల స్థలాలు, గ్రామీణ రోడ్ల వద్ద అప్రమత్తంగా వాహనాలు నడపాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చునని సూచించారు. ద్విచక్ర వాహనంపై కూర్చునే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత హెల్మెట్ వినియోగం అవగాహన ర్యాలీని నిర్వహించామని తెలిపారు. ప్రతి పౌరుడు ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాల పట్ల, సురక్షిత ప్రయాణం పట్ల, రహదారుల వినియోగం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రజలకు రోడ్డు నియమాల పట్ల జాగ్రత్తల పట్ల విస్తృతంగా

అవగాహన కల్పిస్తుందని ప్రజలు వాహనదారులు గమనించాలని కోరారు. వాహనదారులు

వాహనాలు నిదానంగా నడపాలని కోరారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# భూ బదలాయింపుపై హౌజ్‌కమిటీ వేయాలి.. ఎమ్మెల్యే దానం నాగేందర్ డిమాండ్

**హైదరాబాద్, మార్చి 29:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గందరగోళ నెలకొంది. సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి, పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేశారు. సమావేశాల్లో భాగంగా మాజీ మంత్రి, ప్రస్తుత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు పెను సంచలనం సృష్టిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని ఆయన చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.నా సొంత భూమినే కంపెనీకి ఇచ్చారు..ఎమట?ల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. 'నా సొంత భూమిని కేటీఆర్ ఒక ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టారు. ఆ సమయంలో అధికారంలో చేతిలో ఉండటంతో నేను తీవ్రంగా నష్టపోయాను. నేను హైదరాబా



ద్‌లో పుట్టి పెరిగినప్పటికీ, అప్పుడు ఏమీ చేయలేక నోరు మూసుకోవాల్సి వచ్చింది. భూ బదలాయింపుల్లో జరిగిన అక్రమాలను వెలికితీయడానికి ప్రభుత్వం తక్షణమే హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్న. ఈ అక్రమాలకు సంబంధించిన అన్ని ఆధారాలు, పత్రాలు నా వద్ద ఉన్నాయి. ప్రభుత్వం కోరితే వాటిని సమర్పించడానికి నేను సిద్ధంగా ఉన్నా. నేను వ్యక్తిగతంగా ఎంత నష్టపోయానో నాకు మాత్రమే తెలుసు. ఇవన్నీ బయటకు రావాల్సిన అవసరం ఉంది.రూ. 200 కోట్ల విలువైన భూమి కబ్జా చేశారు..వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'హన్మకొండలో సుమారు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ పేరుతో అక్రమంగా దక్కించు కున్నారు. గత ప్రభుత్వ హయాం లో అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట. నా ఆరోపణలు నిరూపిం చకుంటే 48గంటల్లో పదవికి రాజీనామా చేస్తా. బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ భూ దోపిడీపై హౌజ్ కమిటీ వేయాలి. అక్రమంగా నిర్మించిన పార్టీ కార్యాలయాల విషయంలో కఠినంగా వ్యవహరించి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలి' అని అన్నారు.లక్షల దోచుకున్నారు. తెలంగాణ అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత పదేళ్ల కాలంలో జరిగిన భూ కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయి. లక్షల ఎకరాలు ప్రభుత్వ భూములను దోచుకున్నారు. ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని కంపెనీల యజమానులను బెదిరించారు. వారి వద్ద ఉన్న విలువైన భూములను బలవంతంగా బదలాయించుకున్నారు. ఇదొక వ్యవస్థీకృత దోపిడి. బాలానగర్ ప్రాంతంలో జరిగిన భూ అక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి' అని అన్నారు.

# ప్రభుత్వ ట్యాంకర్... ప్రైవేటు పనులకా




**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల( ప్రతినిధి ) :** మండల కేంద్రంలోని పోలుమల్ల గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ ట్యాంకర్ ను ప్రైవేటు పనులకు వాడుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు వివరాలలోకి వెళితే పోలుమల్ల గ్రామపంచాయతీ కి సంబంధించిన ట్యాంకరును పంచాయతీ కార్యదర్శి కి తెలవకుండా స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో సొంత పనులకు ట్యాంకర్ ను వినియోగించడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల కోసం ఉపయోగించే ట్యాంకర్ ను సొంత పనులకు ఉపయోగించడం ఎంతవరకు సమాజ సమని వారు ఆరోపిస్తున్నారు కావున సర్పంచ్ ఇకనైనా తప్పుడు నిర్ణయాలు మార్చుకొని పోలుమల్ల ప్రజానీకానికి ఉపయోగపడేటట్లు నిర్ణయాలు తీసుకోవాలని వారన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టి గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపించే వ్యక్తి ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదని వారు అభిప్రాయపడ్డారు ఇట్టి విషయంపై స్థానిక అధికారులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరడం జరిగినది ఈ కార్యక్రమంలో భూతం లింగరాజు యాదవ్ తాళ్లపల్లి సైదులు పాల్వాయి పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# మమ్మల్ని తొక్కుతామన్నాడు.


**హైదరాబాద్,** అసెంబ్లీని కాంగ్రెస్ ఇష్టానుసారంగా నడిపిస్తుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. అక్రమ మైనింగ్‌పై హరీశ్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారని.. దానిపై హౌస్ కమిటీ వేయాలని కోరామని తెలిపారు. మేం హౌస్ కమిటీకి డిమాండ్ చేస్తే సీబీ సీఐడీ విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అన్నారని తెలిపారు. మా డిమాండ్‌ను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం యత్నించిందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పొంగులేటి అంశంపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. సభాసంఘం అంశాన్ని వదిలేసి సీఎం కులాల ప్రస్తావన తీసుకొచ్చారని పేర్కొన్నారు. కడియం, దానం ఏ పార్టీ సభ్యులని వారికి మాట్లాడే అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. మీరు ఏ పార్టీ వారో చెప్పాలని కౌశిక్ రెడ్డి అడిగారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అసెంబ్లీలో ఏ కమిటీలు లేవని తలసాని తెలిపారు. స్పీకర్‌ను దళితుడుఅని మేం ఎప్పుడూ భావించలేదని అన్నారు. ఉన్నతమైన వ్యక్తిగానే స్పీకర్‌ను గౌరవించామని పేర్కొన్నారు. మా డిమాండ్‌పై నిరసన తెలియజేస్తుంటే, అటెన్షన్ డైవర్ట్‌లో భాగంగా కులాలకు అంటగట్టే ప్రయత్నం ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి చేశాడని తెలిపారు. నా వెంట్రుక పీకలేరని కడియం శ్రీహరి వ్యవహారశైలి ఉందన్నారు. సబ్ ఆర్డర్ లేనప్పుడు అనేక అంశాలు జరుగుతుంటాయని చెప్పారు. భట్టి విక్రమార్క అంటే బీఆర్ఎస్‌కు గౌరవమని తెలిపారు. ఆనాడు భట్టి విక్రమార్క పాదయాత్ర చేశాడని ముఖ్యమంత్రి గుర్తుచేశాడని.. భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. సభలో అధికార పార్టీ సభ్యుల చేత బీఆర్ఎస్ ను తిట్టించారని తెలిపారు. వెనుకబడి తరగతుల పద్దుల విషయంలో చర్చపై వాస్తవాలు బయటకొస్తాయనే డైవర్షన్ పాలిటిక్స్ ఏస్తున్నారని మండిపడ్డారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి వేల కోట్లు పెడుతున్నామని చెప్పి, వద రూపాయల ఖర్చు చేయలేదని తెలిపారు.

# ఆదిలాబాద్, నాగార్జునసాగర్‌లలో ఎయిర్‌పోర్టులు - మామునూరు విమానాశ్రయం ప్రారంభం అప్పుడే!

**హైదరాబాద్, మార్చి 29:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ గతవారం ఆమోదించిన ఉడాన్ 2.0 ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విస్తృత ప్రయోజనాలు కలగనున్నాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటికే ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లను ఎయిర్‌పోం్టలుగా అభివృద్ధి చేసే వీలున్నందున తెలంగాణ రాష్ట్రంలోని నాగార్జునసాగర్‌లలో కొత్త విమానాశ్రయాలు నిర్మించేందుకు వీలుకలుగుతుందని చెప్పారు. కర్నూలు, కడప ఎయిర్‌పోర్టుల నుంచి ఢిల్లీ, ఇతర నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని వివరించారు. ఢిల్లీ సమీపంలోని నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించిన సందర్భంగా ఆయన శనివారం రాత్రి తన నివాసంలో కొత్తగా ఏర్పాటు చేయబోవు విమానాశ్రయాలకు సంబంధించి పలు వివరాలు తెలిపారు.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి : ప్రస్తుతం కేంద్ర రక్షణశాఖ ఆధీనంలో ఉన్న ఆదిలాబాద్ ఎయిర్‌ఫోర్స్ ఎయిర్‌స్ట్రిప్‌ను తాము స్వాధీనం చేసుకోబోమని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మిగిలిన



భూమిని సేకరించి అందులో ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తామని వెల్లడించారు. బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే కింద ట్రాఫిక్ టన్నెల్‌నకు అనుమతివ్వడానికి తమకు అభ్యంతరం లేదని రామ్మోహన్ నాయుడు అన్నారు. అందుకు అవసరమైనటువంటి ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తే తాము అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉడాన్ 2.0 ద్వారా కేటాయించిన రూ.28 వేల కోట్లలో రూ.12 వేల కోట్లు 100 ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి వినియోగిస్తామని రామ్మోహన్ నాయుడు చెప్పారు. 200 హెలిపోర్టుల నిర్మాణానికి రూ.3,500 కోట్లు ఖర్చు చేయనున్నామని వెల్లడించారు. మరో రూ.10వేల కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద విమానయాన సంస్థలకు ఇవ్వనున్నట్లుగా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భోగాపురం కొత్త విమానాశ్రయం, విజయవాడలో విస్తరించిన విమానాశ్రయం రెండూ జూన్‌కల్లా అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు. జూన్‌లో మామునూరు శంకుస్థాపనకు ఏర్పాట్లు : తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ సమీపంలోని మామునూరు విమానాశ్రయ దస్త్రం ప్రస్తుతం అంతర్‌మంత్రిత్వశాఖల సంప్రదింపుల దశలో ఉంది. ఈ ఎయిర్?పోర్టులో భాగస్వామ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. కానీ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించే ఎయిర్‌పోపై ఎంబ్రాయిర్ అనే సంస్థ రెండు మూడునెలల్లో నిర్ణయం తీసుకోనుంది. 2028 చివరినాటికి దేశంలో తయారుచేసిన తొలి విమానాన్ని బయటికి తీసుకురావాలన్నది ఆ సంస్థ ఉద్దేశమని రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్ : ఓరుగల్లు నగరంలో మామునూరు ఎయిర్?పోర్టు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్? నాయుడు జీఎంఆర్ సంస్థతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఈ విషయం తర్వాత మామునూరుకు జీఎంఆర్ సంస్థ అంగీకారం తెలిపింది. నిర్మాణ పనులను చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశించారు.అభివృద్ధికి దోహదం : విమానాశ్రయం ఏర్పాటు అంశం ఒక్కో దశ దాటుతూ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే ఓరుగల్లు రింగు రోడ్డు ప్రాజెక్టుల విషయంలో కదలిక వచ్చింది. ఉత్తర తెలంగాణలో పెద్ద నగరంగా ఉన్న ఈ ప్రాంతంలో విమాన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లయితే రవాణా రంగం మరింత అభివృద్ధి సాధించటానికి దోహదం చేస్తుందని స్థానికులు చెబుతున్నారు. శివారు ప్రాంతాల్లో భూముల ధరలు పెరగటం, పలు మార్గాల్లో వ్యాపార సంస్థలు విస్తరించటం లాంటివాటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. దీంతో వాణిజ్యపరంగా వరంగల్ వృద్ధి చెందుతుందనే అభిప్రాయం స్థానికుల నుంచి వ్యక్తమవుతుంది.

# ఈ 19 కుంభకోణాలపై విచారణ జరిపించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ లేఖ

**హైదరాబాద్, మార్చి 29:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ శాసనస భాపక్షం లేఖ రాసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి కుంభకోణాలపై విచారణ జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ లేఖలో డిమాండ్ చేశారు. అవినీతి, కుంభకోణాలపై సభా సంఘం లేదా సిట్టింగ్ జడ్జితో పాటు మరో 19 అంశాలపై విచారణ చేయించాలని పేర్కొ న్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులతో సహా ఇతర ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చేయాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం సభ్యులు డిమాండ్ చేశారు.అవినీతి, కుంభకోణాలపై లేఖ రాస్తే విచారణ జరుపుతామని శాసనసభలో స్వయంగా సీఎం ప్రకటించారని, కాంగ్రెస్ పాలనలో జరిగిన కుంభకోణాల వివరాలు అందిస్తున్నామని ఆ లేఖతో పేర్కొన్నారు. మాటపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ కుంభకోణాలపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, ఇందులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.



బీఆర్ఎస్ విచారణ కోరుతున్న 19 అంశాలు ఇవే :సివిల్ సప్లై స్కామ్ అమృత్ టెండర్ల స్కామ్ కేఎల్ఎస్ఆర్ స్కామ్ నైనీ కోల్ బ్లాక్ -- సింగరేణి స్కామ్ సింగరేణి ఓబీ స్కామ్ సోలార్ పవర్ స్కామ్ ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్కామ్ హెచ్‌సీయూ భూముల స్కామ్ గచర్ల ల్యాండ్ స్కామ్ కోటి ఎకరాల భూమి నిషేధిత జాబితా స్కావ్ఎక్సైజ్ మైక్రో బ్రూవరీ స్కామ్‌హామ్ రోడ్స్ స్కామ్ టీడీఆర్ స్కామ్ యంగ్ ఇండియా స్కూల్స్ స్కామ్ ఫోర్త్ సిటీ స్కామ్ హిల్ టీపీ స్కామ్అక్రమ మైనింగ్ స్కామ్ డెక్కన్ సిమెంట్స్ స్కామ్ మంచి రేవుల దేవాదాయ భూముల కుంభకోణంసిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి : అంతకుముందు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవ హారంపై సభా సంఘం వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్?లోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. ఆ పార్టీ నేతలు హరీశ్?రావు, కేటీఆర్ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. శాసనసభ సమావేశాలకు వెళ్తూ ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళనకు దిగారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై ఆధారాలతో సహా బయట పెట్టామని, అవినీతి మంత్రిపై హౌస్ కమిటీ వెయ్యాలని, అవసరమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఇతర సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎందుకు అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తప్పుచేయకపోతే భయమెందుకని నిలదీశారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూసి, దిగి రాకపోతే గవర్నర్‌ను కలిసి చర్యలు తీసుకో వాలని అడుగుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి కుటుంబాన్ని ఎందుకు కాపాడాలని ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. మెట్రో భూముల అంశంపై ప్రభుత్వ చర్యలను కేటీఆర్ తప్పుబట్టారు. కాంగ్రెస్ అడ్డగోలు పాలనపై బీజేపీ మద్దతు ఇస్తున్నట్లు ఉందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తేల్చిచెప్పారు "రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దూరపు బంధువులది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారు. ఒప్పుకున్నారు. ముఖ్యమంత్రి వాటా ఉన్నం దుకు చర్య తీసుకోవడం లేదా మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డిని బర్తరఫ్ చేయాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం దిగిరాకపోతే గవర్నర్‌ను కలుస్తాం. గవర్నర్‌ను కలిసి పొంగు లేటిని బర్తరఫ్ చేసి చర్యలు తీసుకోవాలని కోరతాం" – కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే.

# ఎన్ని విచారణలు వేసినా.. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం

**హైదరాబాద్,** అసెంబ్లీలో తమకు మైక్ ఇవ్వడం లేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైక్ ఇచ్చినా కూడా కట్ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. జీరో అవర్‌ను గంటలు గంటలుగా నడిపిస్తున్నారని తెలిపారు. ఎన్ని ప్రశ్నలు లేవనెత్తినా సూటిగా సమాధానం ఇవ్వడం లేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కాంగ్రెస్ ఏం చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు. చాలా కుంభకోణాలు బయటపెడితే సమాధానం ఉండదని అన్నారు. అక్రమ మైనింగ్‌ను హరీశ్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. మైనింగ్‌ను సీజ్ చేయకుండా నోటీసులు ఇవ్వమేంటని ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు కాంగ్రెస్‌కు భయమెందుకు అని అడిగారు. ప్రభుత్వ అవినీతిని సభలో ప్రస్తావిస్తున్నామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వం



నుంచి స్పందన రావడం లేదని అన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.ప్రతిపక్షంగా ప్రజల సమస్యలు ఎత్తి చూపిస్తామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కులాన్ని తీసుకొచ్చి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సీతక్కను ఏమని అవమానించామని ప్రశ్నించారు. రైతుబంధు, యూరియా, నీళ్లు వస్తలేవని అడగొద్దా అని నిలదీశారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలే కదా మాట్లాడేదని అని అడిగారు.


# జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 7,624 కేసుల పరిష్కారం

ఈ నెల 28న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీసు శాఖ, న్యాయవిభాగం, ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో విశేష ఫలితాలు వచ్చాయని నల్గగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించామని పేర్కొన్నారు. ఇందులో మొత్తం 7,624 కేసులు విజయవంతంగా వెల్లడించారు.జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని శరత్ చంద్ర పవార్ తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతో పాటు, ప్రజల సమయం, ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు.

ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు, సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని చెప్పారు.

# హరీశ్‌తో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్‌కు సీఎం సలహా: బండి సంజయ్

**హైదరాబాద్, మార్చి 29:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కైయ్యారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. అందుకే కేటీఆర్‌పై ఉన్న అవినీతి కేసుల జోలికి సీఎం రేవంత్ రెడ్డి పోవడం లేదని ఆరోపించారు. కల్వకుంట్ల కవిత, కేటీఆర్‌లకు సయోధ్య కుదుర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి మధ్యవర్తి పాత్ర పోషిస్తున్నరని వ్యంగ్యంగా అన్నారు. హరీశ్ రావును మాత్రమే లక్ష్యంగా చేసుకుని కాళేశ్వరంలోని కొంత భాగం అవినీతిపై మాత్రమే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరంలో జరిగిన రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరిపితే మొత్తం బండారం బయపటపడుతుందనే భయంతోనే అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ అవినీతిపైనే విచారణకు పరిమితం అయ్యారని



విమర్శించారు.ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో కాళేశ్వరం అంశంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా ఆయన పైవిధంగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు నడిపిస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ ఒక్కటేనన్నారు. హరీశ్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్‌కు సీఎం రేవంత్ సలహా ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంతోపాటు హరీశ్‌పై ఉన్నంత పగ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌కు లేదని తెలిపారు. అందుకే ఈ ఫార్ములా రేసులు, డ్రగ్స్, ఫాంహౌస్ కేసులపై సీఎం రేవంత్ మాట్లాడటం లేదని గుర్తు చేశారు. కేటీఆర్‌పై రేవంత్ చాలా ప్రేమ ఒలకపోస్తున్నాడని వ్యంగ్యంగా అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారని జోస్యం చెప్పారు. నూరు శాతం కేటీఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటేనని బల్లగుద్ది స్పష్టం చేశారు.కేసీఆర్‌పై ఉన్న కోపం కూడా రేవంత్‌కు పోయిందన్నారు. ఇద్దరి మధ్య డీల్ కుదిరిందని చెప్పారు. అందుకే హరీశ్‌ను మాత్రమే లక్ష్యంగా చేస్తున్నారే తప్ప కేటీఆర్ గురించి మాట్లాడటం లేదని వివరించారు. అందుకే ఆలోచించుకోవాలంటూ హరీశ్‌కు సూచించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటా? కాదా? అనేది ఆయనే తేల్చుకోవాలంటూ హరీశ్‌కు హితవు పలికారు.కాళేశ్వరంపై మాత్రమే సీబీఐ విచారణ జరపాలని సీఎం రేవంత్ రెడ్డి కోరుతున్నారని పేర్కొన్నారు. మరి మిగతా అవినీతి కేసుల పరిస్థితి ఏమిటి? పోనీ కాళేశ్వరంపై విచారణ జరపాలని భావిస్తే... లక్ష కోట్ల రూపాయలకుపైగా అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డే చెప్పారు కదా? మరి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డకు సంబంధించి రూ.9 వేల కోట్ల అవినీతిపైనే సీబీఐ విచారణ జరపాలని ఎందుకు పట్టుపడుతున్నట్లు? అంటూ సందేహం వ్యక్తం చేశారు. అందులోనే హరీష్ పాత్ర ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**అమరావతి, మార్చి28:** తెలుగుదేశం పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు, అభిమానులకు.. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కేవలం ఒక రాజకీయ వేదిక మాత్రమే కాదు.. ఇది కోట్లాది మంది తెలుగు వారి ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపం. 'సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో ఎన్టీఆర్ ప్రజల్లోకి వెళ్లిన తీరు.. భారత రాజకీయాల్లో ఒక అరుదైన ఘట్టం. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేశారు.'తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. యుగపురుషుడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ తరతరాల



తెలుగు వారి ఆకాంక్షలకు ప్రతిరూపం. పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలనే ఆయన సిద్ధాంతాన్ని సదా పాటిస్తున్నాం. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ. ఆవిర్భావ దినోత్సవం అంటే మన ఇంటి పండుగ. ఈ పండుగ సందర్భం గా ప్రతి కార్యకర్తకూ పేరుపేరునా శుభాకాంక్షలు తెలుపుతున్నాను' అని పేర్కొన్నారు.ఎన్టీఆర్ ఆశయ సాధనలో 44 ఏళ్లు: మంత్రి నారా లోకేశ్టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'తెలుగువారి ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం పుట్టింది తెలుగుదేశం పార్టీ. సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు అని నినదించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ ఎన్టీఆర్ గారి స్ఫూర్తితో పేద ప్రజలకు అండగా నిలిచింది. టీడీపీ ఆవిర్భావం తర్వాతే సమాజంలో అణగారిన, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చింది. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసినప్రజలే దేవుళ్లు అని నినదించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ ఎన్టీఆర్ పార్టీ తెలుగుదేశం పార్టీ. ప్రపంచంలో తెలుగువారిని నెం.1గా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు.' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## సీసీటీవీ కెమెరా వైర్ అనుకుని కేబుల్ వైర్ కట్ చేసింది

**రాజమండ్రి, మార్చి 29:** జస్ట్ సీసీటీవీ కెమెరా వైర్ కట్ చేయబోయి.. పొరపాటున కేబుల్ వైర్ కట్ చేసింది. తన ఇంట్లో దొంగలు పడి160 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లిపోయారంటూ కట్టుకథ అల్లింది. సీసీ టీవీ కెమెరా వైర్ కట్ చేశాగా.. ఇక తాను ఎవరికి దొరకనని అనుకుంది. కానీ తన ఇంట్లో బంగారం చోరీ జరగడం.. ఆ తర్వాత జరిగిన తతంగమంతా సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయింది. దీంతో పోలీసులకు చిక్కి జైలులో ప్రస్తుతం ఊచలు లెక్కిస్తోంది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ సమీపంలోని కాపవరం శివారులో ఒక ఇంట్లో ఎం. పద్మ అనే మహిళ నివసిస్తోంది. ఆమె పిల్లలు ఇద్దరు విదేశాల్లో స్థిరపడ్డారు. గురువారం (26-03-26) అర్ధరాత్రి తన ఇంట్లో దొంగలు పడి 160 గ్రాముల బంగారం దోచుకెళ్లారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.తాను నిద్రలో ఉండగా ముగ్గురు దుండగులు ముసుగులు ధరించి ఇంట్లోకి వచ్చారని.. మరో వ్యక్తి బయట కాపలాగా ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొంది. వారి అలికిడితో తాను నిద్ర లేచానని పేర్కొంది. దుండగులు తన కాళ్లు చేతులు తాళ్లతో కట్టేశారని చెప్పింది. తన ఇంట్లోని లక్షల విలువైన 160 గ్రాముల బంగారాన్ని వారు దోచుకెళ్లారని చెప్పింది. అంతేకాకుండా.. తన ఇంట్లో దొంగలు గుడ్లు వండుకొని.. అన్నం కూడా తిన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె ఇంటిలోని సీసీ టీవీ కెమెరాలనే కాకుండా.. ఆ పరిసరాల్లోని సీసీ టీవీ కెమెరాలను సైతం పోలీసులు జల్లెడ పట్టారు.

## ఎన్ని కష్టాలు వచ్చినా కార్యకర్తలు పార్టీ జెండా వదల్లేదు

**అమరావతి, మార్చి 29:** ఎన్ని కష్టాలు వచ్చినా కార్యకర్తలు టీడీపీ జెండా వదల్లేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైసీపీ హయాంలో టీడీపీ కార్యకర్తలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, మెడపై కత్తిపెట్టి బెదిరించినా వెనక్కి మాత్రం తగ్గలేదని తెలిపారు. తెలుగు దేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆది వారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ అధినేత సీఎం చంద్రబాబు నా యుడు, మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ..'అనేక సంక్షేమ కార్యక్రమాలు పరిచయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్. కష్టపడే కార్యకర్తను ఎప్పుడూ గుర్తిస్తాం.. గౌరవిస్తాం. అలక వీడాలని పార్టీ నేతలు, కార్యకర్తలను కోరుతున్నా. మీరు అలిగితే పార్టీతో పాటు రాష్ట్ర ప్రజలు నష్టపోతారు. జగన్‌కు ఈ మధ్య క్రెడిట్ చోరీ డిజార్డర్ జబ్బు వచ్చింది. వచ్చే కంపెనీలను తానే తెచ్చానని జగన్ చెప్పుకుంటున్నారు. కార్యకర్తల సంక్షేమానికి రూ.150 కోట్లు ఖర్చు చేశాం'



అని అన్నారు.ముఖ్య ఘట్టాలతో వీడియో ప్రెజెంటేషన్ఈ కార్యక్రమంలో టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన ముఖ్య ఘట్టాలతో వీడియో ప్రెజెంటేషన్ ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ రథయాత్ర, సంక్షేమ కార్యక్రమాలు, విధాన నిర్ణయాలు వివరిస్తూ వీడియో సాగింది. ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చిన కార్యక్రమాలతో వీడియో ప్రెజెంటేషన్ అద్భుతంగా ఉంది. పార్టీ కోసం లోకేశ్ చేసిన కృషి, పాదయాత్రతో పాటు 2019-24 మధ్య జరిగిన హింస, దౌర్జన్యాలు వివరిస్తూ వీడియో ఉంది. చంద్రబాబు, సీనియర్ నేతలపై కేసులు, అరెస్టుల తీరును వివరిస్తూ వీడియో సాగింది. వీడియో ప్రెజెంటేషన్‌లో వైఎస్ వివేకా హత్య అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించటం జరిగింది.

## ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ.. కీలక జిల్లాలకు కొత్త కలెక్టర్లు

**అమరావతి, మార్చి28:**ఏపీ ప్రభుత్వం రాష్ట్ర పాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చేపట్టింది. పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కీలక జిల్లాల కలెక్టర్లను మారుస్తూ.. పాలనలో వేగం పెంచేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా కలెక్టరుగా అభిషిక్త్ కిశోర్ నియమితులయ్యారు. అలాగే గుంటూరు జిల్లా బాధ్యతలను సాయికాంత్ వర్మకు అప్పగించారు. కాకినాడ జిల్లా కలెక్టరుగా ఉన్న షణ్మోహన్‌ను ఏపీఈడీబీ సీఈవోగా బదిలీ చేయగా.. ఆయన స్థానంలో హరేంద్ర ప్రసాద్ కాకినాడ జిల్లా కొత్త కలెక్టరుగా బాధ్యతలు చేపట్టనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరుగా ప్రస్తుతం అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టరుగా ఉన్న టి.నిశాంతిని నియమించారు.జిల్లాల కలెక్టర్లతో పాటు పలువురు అధికారులకు కార్పొరేషన్లలో కీలక బాధ్యతలు అప్పగించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరుగా ఉన్న దినేష్ కుమార్ను ఏపీఐఐసీ ఎండీగా బదిలీ




చేశారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా తమీమ్ అన్సారియాను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక కోనసీమ జిల్లా కలెక్టర్ బదిలీ కావడంతో.. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అక్కడి జాయింట్ కలెక్టరే పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని జీవోలో స్పష్టం చేశారు.సీఆర్‌డీఏ కమిషనర్‌గా రామరాజు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ నూతన కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి వి. విజయ రామరాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. రాయపూడిలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఐదవ అంతస్తులోని కమిషనర్ ఛాంబర్‌లో ముందుగా పూజారులచే శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఏ. భార్గవతేజ, ఆఫీస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వల్లభనేని శ్రీనివాసరావులతో పాటు ఇతర ముఖ్య అధికారుల సమక్షంలో రామరాజు బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు చేపట్టిన తర్వాత కమిషనర్ విజయ రామరాజు సీఆర్‌డీఏలోని అన్ని విభాగాల ప్రధాన అధికారులతో తొలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాజధాని అమరావతి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, భవిష్యత్తు ప్రణాళికల గురించి అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. రాజధాని ప్రాంత అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రధానంగా లక్ష్యంగా పని చేస్తామని ఈ సందర్భంగా అధికారులకు కమిషనర్ దిశానిర్దేశం చేశారు. సీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'ఇక అమరావతిని ఏ శక్తి కదిలించలేదు' - శాసనసభ ఏకగ్రీవ ఆమోదంపై హర్షం వ్యక్తం చేసిన రైతులు

**అమరావతి:** ఏకైక రాజధానిగా శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించడంపై రాజధాని రైతులు, మహిళలు హర్షం చేశారు. ఇక రాజధానిని ఎవరూ మార్చలేరని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్లో రాజధాని తీర్మానం త్వరగా ఆమోదం పొందేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతి కోసం చేసిన ఐదేళ్ల పోరాట ఫలితం ఇప్పుడు కనిపించడం సంతోషంగా ఉందన్నారు.'ఇక అమరావతిని ఏ శక్తి కదిలించలేదు' - శాసనసభ ఏకగ్రీవ ఆమోదంపై హర్షం వ్యక్తం చేసిన రైతులుఅమరావతి రాజధానిగా కూటమి ప్రభుత్వం తీర్మానం చేయడం చాలా ఆనందంగా ఉందని రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్?లో ఈ బిల్లు ఏప్రిల్ 2వ తేదీలోగా ప్రవేశపెట్టాలని ఆశిస్తున్నారు. గత 5 ఏళ్లు రాక్షస పాలనలో నిద్రలేని రాత్రులు ఎన్నో గడపామన్నారు. అదే విధంగా మరెన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నామని అన్నారు. దానికి తగిన ఫలితం అసెంబ్లీ



తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినందుకు ఎంతో ఆనందంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇక అమరావతిని ఏ శక్తి కదిలించలేదని రైతులు అన్నారు."ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఇంకా ఎవరూ మార్చలేని విధంగా తీర్మానం చేశారు. అమరావతి మీద విషం చిమ్మాలన్నా, అమరావతిని నిర్వీర్యం చేయాలన్నా ఆలోచన కూడా చేయాలేని పరిస్థితి. అమరావతికి చట్టబద్ధత కల్పించడం గొప్పవిషయం. సీఎం చంద్రబాబు వల్లే ఇదంతా సాధ్యం అవుతుంది . " - రైతులు, అమరావతిహర్షం వ్యక్తం చేస్తున్న రైతులు : అమరావతి పై అసెంబ్లీ తీర్మానాన్ని రాజధాని రైతులు సందర్శకుల గ్యాలరీ నుంచి వీక్షించారు. అసెంబ్లీ వాయిదా అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను కలిసి ధన్యవాదాలు తెలిపారు. భూములిచ్చిన రైతులకు, జేఏసీ ప్రతినిధులకు శాసనసభ తీర్మానం ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించారు. అమరావతి చట్టబద్ధతకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం పొందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో హ్యాష్ ట్యాగ్ హిస్టారిక్ అమరావతి రిసొల్యూషన్ ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.కేంద్రానికి తీర్మానం: అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా అమోదించింది. తీర్మానం ఆమోదం అనంతరం శాసనసభను స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిరవధికంగా చారిత్రాత్మక తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ కేంద్రానికి పంపించింది. తీర్మానాన్ని కేంద్ర హోంమంత్రి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌లకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెంటనే పంపించారు. తీర్మానం ప్రతులను హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ పంపించారు.

## అమరావతి బిల్లుకు చట్టబద్ధత.. అమిత్ షాతో మాట్లాడిన వెంకయ్య నాయుడు..



**అమరావతి:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి బిల్లుకు చట్ట బద్ధత కల్పించే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చర్చించారు. ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లును ఈ సమావేశాల్లోనే పెట్టి ఆమోది 2ంచాలని వెంకయ్య కోరారు. అమరావతికి 2015లో మోదీ శంకుస్థాపన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా అమిత్‌షాకు గుర్తుచేసినట్టు వెంకయ్య తెలిపారు అమరావతి అభివృద్ధికి కేంద్రం ఆర్థిక సాయం కూడా చేసిందని, భవిష్యత్తులో అమరావతికి ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూడాలని హోంమంత్రి అమిత్ షా కి వెంకయ్య విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తికి అమిత్ షా సానుకూలంగా స్పందించారని వెంకయ్య నాయుడు తెలిపారు. తన మంత్రిత్వ శాఖ నుంచి అన్నీ క్లియర్ అయ్యాయని, కేబినెట్‌లో పెట్టి ఆమోదించడం ఒక్కటే మిగిలిందని అమిత్ షా చెప్పినట్టు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన డాక్టర్ కుటుంబం.. అసలేం జరిగిందంటే

**పల్నాడు జిల్లా:** నరసరావుపేటలో కుటుంబం మట్నత్తం ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర కలకలం రేపుతోంది. నాదెండ్ల మండలం సాతులూరుగా చెందిన ఓ డాక్టర్ కుటుంబం ప్రాణాలు తీసుకునేందుకు సిద్ధపడింది. ఏం కష్టమట్నచ్చిందో తెలియదు కానీ మూడేళ్ల చిన్నారితో సహా భార్యాభర్తలిద్దరూ బలవన్మరణా నికి యత్నించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన డాక్టర్ గోపి కుటుంబం మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో నివాసం ఉంటోంది.భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రిలో గోపి డాక్టర్‌గా అతని భార్య శంకర కుమారి నర్సుగా పని చేస్తున్నారు. వారికి మూడేళ్ల చిన్నారి మౌనిక ఉంది. బాధిత కుటుంబం నిన్న(శనివారం) రాత్రి భోపాల్ నుంచి నరసరావుపేటకి వచ్చింది. వారంతా దినేశ్ గ్రాండ్ లాడ్జిలో రూమ్ తీసుకున్నారు. అనంతరం ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటనలో శంకర కుమారి, చిన్నారి మౌనిక మృతిచెందారు. గోపి ప్రాణాలతో




కొట్టుమిట్టాడుతున్నారు. గమనించిన లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు.. గోపిని వెంటనే నరసరావుపేట ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆ గదిని నిశితంగా పరిశీలించారు. మత్తు ఇంజెక్షన్ తీసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాలను సైతం నరసరావుపేట ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన స్థానికులను కన్నీటిపర్యంతం చేసింది. అయితే, కుటుంబం మట్నత్తం ఆత్మహత్యాయత్నం చేసుకునేంత కష్టం ఏం వచ్చిందా? అని పోలీసులు, స్థానికులు చర్చించుకుంటున్నారు.

## తిరుమల హోటళ్లపై యుద్ధ ప్రభావం - అన్నప్రసాద కేంద్రాలకు పెరిగిన భక్తుల తాకిడి

**తిరుమల :**క్షేత్రం! నిత్యం లక్షల్లో వచ్చే భక్తజనం! వారిని ఆకట్టుకునేలా కొండపైనే ప్రైవేట్ హోటళ్లు, పాస్ట్ ఫుడ్ సెంటర్లు. నిత్యం కళకళలాడే ప్రైవేట్ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు యుద్ధం కారణంగా ఇప్పుడు విలవిలలాడుతున్నాయి. సగానికిపైగా మూతపడ్డాయి. అయినా శ్రీవారి భక్తులు మాత్రం ఆహారానికి ఇబ్బందిపడటం లేదు. టీటీడీ అన్నప్రసాద కేంద్రాలు వారి ఆకలి తీర్చుతున్నాయి. ఎంతమంది భక్తులు వచ్చినా అన్నప్రసాద వితరణకు ఆటంకం లేకుండా టీటీడీ ముందస్తు చర్యలు తీసుకుంటోంది.తిరుమల హోటళ్లపై యుద్ధ ప్రభావం - అన్నప్రసాద కేంద్రాలకు పెరిగిన భక్తుల తాకిడి పశ్చిమాసియా యుద్ధం కారణంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా తగ్గింది. ఈ నెల 5 నుంచి ఏజెన్సీలు తిరుమలకు గ్యాస్ సరఫరాను 50 శాతానికిపైగా తగ్గించాయి. రోజూ 400 నుంచి 500 వాణిజ్య సిలిండర్లు తిరుమలకు సరఫరా అవుతుంటే యుద్ధం ప్రభావం వల్ల ఆ సంఖ్య 200 నుంచి 250కు పడిపోయింది. గ్యాస్



కొరతతో తిరుమలలోని 150 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఇప్పటికే 40కి పైగా మూతపడ్డాయి. తెరిచి ఉన్న మిగిలిన హోటళ్లు ఉదయం, సాయంత్రం అల్పాహారాలు మాత్రమే అందుబాటులో ఉంచారు. మరికొన్ని హోటళ్లలో గ్యాస్ ఆదాలో భాగంగా మెనూలో మార్పులు చేశారు. గ్యాస్ ఎక్కువ అవసరమయ్యే పదార్థాలను మెనూ నుంచి తీసేశారు.

ఉచిత అన్నప్రసాద కేంద్రాల వైపు భక్తులు : ప్రైవేట్ హోటళ్లలో కోరుకొన్న ఆహారపదార్థాలు అందుబాటులో లేకపోవడంతో భక్తుల టీటీడీ ఉచిత అన్నప్రసాద కేంద్రాల వైపు వెళుతున్నారు. తరిగొండ వెంగమాంబ కేంద్రంలో రద్దీ అనూహ్యంగా పెరిగింది. గత ఏడాది మార్చి 16 నుంచి 25వ తేదీ మధ్య పది రోజుల్లో 5 లక్షల 95 వేల మంది మధ్యాహ్నం, రాత్రి భోజనం చేశారు. ఈ ఏడాది సరిగ్గా ఇదే పది రోజుల్లో ఆ సంఖ్య ఏకంగా 7 లక్షల 41 వేల 340కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఒక్క మధ్యాహ్నం, రాత్రి భోజనం స్వీకరించిన భక్తుల సంఖ్యే ఏకంగా లక్షా 46 వేలకు పైగా పెరిగింది. ఇక అల్పాహారం తీసుకున్న వారి సంఖ్య కూడా లక్షా 32 వేలు దాటింది.అన్నప్రసాద వితరణకు ఎలాంటి ఢోకా లేదు : ఒకవైపు గ్యాస్ కొరత మరోవైపు భక్తుల రద్దీ పెరుగుతుండటంతో టీటీడీ అప్రమత్తమైంది. ఎల్పీజీ నిల్వలను ఎప్పటికప్పుడు టీటీడీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, వకుళమాత, శ్రీఅక్షయ కేంద్రాల్లో ప్రసాదాల తయారీకి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. టీటీడీకి నిరంతరాయంగా ఎల్పీజీ సరఫరా చేయాలని ×ూజాకు విజ్ఞప్తి చేయగా వారు సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరా యథావిధిగా కొనసాగుతుండటంతో ఎంత మంది భక్తులు వచ్చినా అన్నప్రసాద వితరణకు ఎలాంటి ఢోకా లేదని టీటీడీ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

## డబ్ల్యూటీలో భారత్ దీటైన వైఖరి- చైనా నేతృత్వంలోని ఐఎఫ్‌డీ ఒప్పందానికి నో చెప్పిన ఇండియా

: ప్రపంచ వాణిజ్య సంస్థ ( 14వ మంత్రివర్గ సమావేశంలో భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టంగా వెల్లడించింది. చైనా నేతృత్వంలో ముందుకు వస్తున్న ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ ఫర్ డెవలప్మెంట్ (ఐఎఫ్‌డీ) ఒప్పందాన్ని డబ్ల్యూటీఓలో ఫ్రేమ్‌వర్క్‌లో చేర్చడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ఒప్పందం డబ్ల్యూటీఓ ప్రాథమిక సూత్రాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ స్పష్టం చేశారు. పారదర్శకత పేరుతో వాణిజ్య ప్రతీకార చసమర్థించుకూడదని పేర్కొన్నారు.'మహాత్మా గాంధీ సత్య సిద్ధాంతం నుంచి ప్రేరణ తీసుకుని నిజయం కోసం ఒంటరిగానై నిలబడటానికి భారత్ సిద్ధంగా ఉంది. ఐడీఎఫ్ ఒప్పందాన్ని అనెక్స్-4 కింద డబ్ల్యూటీఓలో చేర్చడాన్ని భారత్ అంగీకరించలేదు. డబ్ల్యూటీఓ ఒప్పందం లోని అనెక్స్?4లో ఉన్న బహుళపక్ష వాణిజ్య ఒప్పందాలు అన్ని సభ్య దేశాలకు తప్పనిసరి కావు. వాటిని అంగీకరించిన దేశాలకు మాత్ర మే వర్తిస్తాయి. అందుకే అలాంటి ఒప్పందాలను డబ్ల్యూటీఓలో చేర్చడం అనేది సంస్థ ప్రాథమిక సూత్రాలను దెబ్బతీస్తుందని భారత్ భావిస్తోంది' అని పీయూశ్ గోయల్ తెలిపారు.నిర్మాణాత్మక చర్చలకు భారత్ సిద్ధం(ఇక డబ్ల్యూటీఓ సంస్కరణ చర్చల్లో భాగంగా బహుళపక్ష వాణిజ్య ఒప్పందాలపై చట్టపరమైన రక్షణలు,



మార్గదర్శకాలు అవసరమని గోయల్ సూచించారు. ఇలాంటి ఒప్పందాలు డబ్ల్యూటీఓలో విభజనకు దారితీసే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల ముందుగా చట్టపరమైన భద్రతా చర్యలు, స్పష్టమైన నియమాలు అవసరమని పేర్కొన్నారు. అదే సమయంలో డబ్ల్యూటీఓ సంస్కరణ అజెండా కింద నిర్మాణాత్మక చర్చలకు భారత్ సిద్ధంగా ఉందని చెప్పారు.గతంలో అబుదాబిలో జరిగిన 13వ మంత్రివర్గ సమావేశంలో కూడా భారత్? ఇదే అంశంపై తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2017లో చైనా, మరికొన్ని దేశాలు ఈ ఐఎఫ్‌డీ ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చా యి. ముఖ్యంగా చైనా పెట్టుబడులపై ఆధారపడే దేశాలు, సార్వభౌమ సంపద నిధులు కలిగిన దేశాలు ఈ ఒప్పందానికి మద్దతు ఇస్తున్నాం యి.'పారదర్శకతతో వాణిజ్య ప్రతీకారం వద్దు'ఇదే సమయంలో పారదర్శకత అనే అంశాన్ని వాణిజ్య ప్రతీకారానికి ఆయుధంగా ఉపయోగించకూడద ని డబ్ల్యూటీఓ సభ్య దేశాలకు భారత్ హెచ్చరించింది. టెక్నికల్ బారియర్స్ టు ట్రేడ్ ఒప్పందంలో భాగంగా సభ్య దేశాలు తమ వాణిజ్య విధానాలు, సబ్సిడీలు, నియంత్రణ చర్యలపై సమాచారం పంచుకోవాల్సి ఉంటుందని తెలిపింది. పారదర్శకత అవసరం అనేది అందరూ అంగీకరిస్తున్నప్పటికీ, దాన్ని అమలు చేసే విధానం కీలకమని భారత్ పేర్కొంది. సమాచారం అందించలేకపోతే శిక్షలు విధించడం వంటి చర్యలు తగవని అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. చాలా దేశాలకు అవసరమైన సాంకేతిక సామర్థ్యం లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని భారత్ వెల్లడించింది. అందుకే, అన్ని దేశాలు సమానంగా తమ బాధ్యతలను నిర్వర్తించగలిగేలా సామర్థ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని భారత్ సూచించింది. ఇది లేకుండా పారదర్శకత పేరుతో ఒత్తిడి తేవడం అన్యాయం అవుతుందని పేర్కొంది. ఇక డబ్ల్యూటీఓ సంస్కరణల్లో భాగంగా కఠినమైన పారదర్శకత నియమాలను తీసుకురావాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది. సబ్సిడీలు, టారిఫ్‌లు, విధాన మార్పులపై సమాచారం సమయానికి ఇవ్వడంలేదని అనేక దేశాలను ఆరోపిస్తోంది. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ విషయంలో తమ ఆందోళనలను వ్యక్తం చేస్తున్నాయి.మార్చి 27న జరిగిన 'లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్' అంశంపై జరిగిన సమావేశంలో కూడా ఈ విషయాన్ని పీయూశ్ గోయల్ ప్రస్తావించారు. డబ్ల్యూటీఓలో సమాన అవకాశాలు ఉండేలా అన్ని దేశాలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకుని, ఉపాధి అవకాశాలు సృష్టించుకునేలా మద్దతు అవసరమని పేర్కొన్నారు.ఇక సదస్సు సందర్భంగా పియూశ్ గోయల్ కెనడా వాణిజ్య మంత్రితో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి, ఫ్రీ ట్రేడ్ ఒప్పందంపై జరుగుతున్న చర్చలను సమీక్షించారు. అలాగే ఒమాన్ వాణిజ్య శాఖ ప్రతినిధులతో కూడా సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు.

## దద్దరిల్లిన సుక్మా అడవులు.. ఓ మావోయిస్టు మృతి



**ఛత్తీస్‌గఢ్:** సుక్మా జిల్లా అడవులు తుపాకుల మోతతో మరోసారి దద్దరిల్లాయి. పోలంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకి మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందినట్లు సమాచారం. పోలంపల్లి అటవీ ప్రాంతంలో మావోలు ఉన్నారని భద్రతా దళాలకు సమాచారం అందింది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా దళాలు వెంటనే కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో వారికి మావోలు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల నుంచి కాల్పులు మట్నదలయ్యాయి. ఈ కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందినట్లు వార్తలు వస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.దేశంలో మావోయిస్టులు లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆపరేషన్ కగార్ చేపట్టి 2026 మార్చి నెలాఖరు నాటికి మావోలు లేకుండా చేయాలని నిర్ణయించింది. భద్రతా దళాలను రంగంలోకి దింపి వరుస ఎన్‌కౌంటర్లతో వందల మందిని హతమార్చింది. దీంతో వేల మంది తుపాకులు వదిలి జనజీవన స్రవంతిలో కలిసేందుకు అడవులు వదిలి బయటకు వచ్చారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు, అగ్రనేతలు వంటి వారు ఉండడం విశేషం.మరోవైపు మార్చి 30న లోక్ సభలో నక్సలిజం నిర్మూలనపై చరిత్రాత్మక చర్చ జరగనుంది. లోక్‌సభలో రూల్ 193 కింద స్వల్పకాలిక చర్చ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే చర్చను ప్రారంభించి నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భద్రతాపరమైన చర్యలు, ఆయా ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులు వంటి అంశాలను సభ దృష్టికి తీసుకురానున్నారు.

## శోభాయాత్ర సందర్భంగా.. గాలిలోకి కాల్పులు జరిపిన బీజేపీ ఎమ్మెల్యే



**భువనేశ్వర్:** శోభాయాత్ర సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే అందరినీ భయభ్రాంతులకు గురి చేశారు. గన్‌తో గాలిలోకి కాల్పులు జరిపారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. ఆ ఎమ్మెల్యేతో పాటు ఆయన వ్యక్తిగత భద్రతా అధికారిపై కేసు నమోదు చేశారు. బీజేపీ పాలిత ఒడిశాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా బలంగీర్ జిల్లాలో శోభాయాత్ర నిర్వహించారు.కాగా, టిట్లాగఢ్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే నవీన్ కుమార్ జైన్ ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ప్యాంటు జేబు నుంచి గన్ తీసి గాలిలోకి కాల్పులు జరిపారు. దీంతో శోభాయాత్రలో పాల్గొన్న వందలాది భక్తులు, స్థానికులు భయాందోళన చెందారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.మరోవైపు ఈ సంఘటనపై పోలీసులు స్పందించారు. బీజేపీ ఎమ్మెల్యే నవీన్ కుమార్ జైన్‌తో పాటు ఆయన వ్యక్తిగత భద్రతా అధికారి (పీఎస్‌వో) ప్రేమ్‌చంద్ నాగ్‌పై కేసు నమోదు చేశారు. ఆ గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పీఎస్‌వోపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామని, సస్పెండ్ చేశామని బలంగీర్ ఎస్పీ అభిలాష్ తెలిపారు. ఎమ్మెల్యే భద్రతా విధుల నుంచి ఆ పీఎస్‌వోను తొలగించినట్లు వెల్లడించారు.

## దేశంలో గ్యాస్ సమస్య! ఇకపై పెళ్లిళ్లకు రెండు సిలిండర్లే- ఆందోళనలో వినియోగదారులు

దేశంలో ప్రస్తుతం పెట్రోలు, డీజిల్, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ఓవైపు స్పష్టం చేస్తుండగా, మరోవైపు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. సరఫరాలో అంతరాయం కలగవచ్చని ఆందోళన రాష్ట్రంలో ఒకే కుటుంబానికి సంబంధించిన పేర్లపై రెండు కంటే ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించిన సందర్భాలు పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఆ కనెక్షన్లను గృహ అవసరాలకు కాకుండా వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారని వెల్లడించారు. దీని వల్ల నిజంగా అవసరమున్న వినియోగదారులకు సరఫరాలో అంతరాయం కలగవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారిపై కఠిన చర్యలుప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కీలక నిర్ణయం



తీసుకుంది. ఇకపై ఒక కుటుంబంలో రెండు కంటే ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఆ చర్యల ద్వారా గ్యాస్ సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని, అవసరమైన వారికి సమయానికి సిలిండర్లు అందుతాయని అధికారులు భావిస్తున్నారు. ఆహార సరఫరా శాఖ కార్యదర్శి ఆనంద్ స్వరూప్ మాట్లాడుతూ, "గ్యాస్ సరఫరా వ్యవస్థను సమతుల్యం చేయడం మా ప్రధాన లక్ష్యం. దుర్వినియోగం, అక్రమ వినియోగాన్ని అరికట్టడం ద్వారా నిజమైన వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది" అని తెలిపారు. ఎంత మంది ఉన్నా రెండు సిలిండర్లే!ఇక పెళ్లిళ్లు, ఇతర పెద్ద కార్యక్రమాల విషయంలో కూడా ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ప్రస్తుతం విస్తృత చర్చకు దారితీస్తోంది. తాజా ఆదేశాల ప్రకారం, పెళ్లి వంటి పెద్ద ఈవెంట్లు నిర్వహించే కుటుంబాలకు కేవలం రెండు గ్యాస్ సిలిండర్లు అందజేస్తారు. అతిథుల సంఖ్య ఎంత ఉన్నా, వంట ఏర్పాట్లు రెండు సిలిండర్లతోనే చేయాల్సి ఉంటుంది. అధికారుల ప్రకారం, ఆ నిర్ణయం వనరుల సమతుల్య వినియోగాన్ని నిర్ధరించేం దుకు తీసుకున్నారు. అధిక వినియోగాన్ని నియంరులు తెలిపారు. ఇది నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలా పాల్లో పాల్గొనే వారిపై లైసెన్సు రద్దు, జరిమా నాలు, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రజలను కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగం చేస్తున్నట్లు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.రెండు సిలిండర్లతో వంట చేయడం కష్టం!అదే సమయంలో కొత్త నిర్ణయాలపై ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొంతమంది ప్రభుత్వ చర్యలను సమర్థిస్తున్నారు. గ్యాస్ వృథాను తగ్గించడంలో ఇవి ఉపయోగపడతాయని, నిజమైన అవసరమున్న వారికి లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు. అయితే మరికొందరు ఆ నియమాలు ప్రాక్టికల్?గా వర్కౌట్ కావని అంటున్నారు. ముఖ్యంగా పెళ్లిళ్ల సమయంలో వందల సంఖ్యలో అతిథులు హాజరవుతారని, అలాంటి సందర్భాల్లో కేవలం రెండు సిలిండర్లతో వంట చేయడం కష్టమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధన వల్ల కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని పేర్కొంటున్నారు. గ్యాస్ సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఎంతవరకు ఫలితాన్నిస్తాయో చూడాలి.

## అసోం ప్రజలకు కాంగ్రెస్ '5 హామీలు'- ఆదివాసీలకు శాశ్వత భూమి పట్టా- రూ.25లక్షల ఆరోగ్య బీమా!

: **అసోం:** ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆదివారం 5 హామీలు ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమం, అందరికీ ఆరోగ్య సంరక్షణ, భూ హక్కులు, జుబీన్ గార్గ్ మృతి కేసులో న్యాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అసోంలోని నౌబోయిచాలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ 5 హామీలను ప్రకటించారు."కాంగ్రెస్ అధికారంలోని వస్తే మహిళలకు నెలవారీ నగదు బదిలీ చేస్తాం. అంతేకాదు, వ్యాపారం ప్రారంభించడానికి లేదా విస్తరించడానికి సిద్ధంగా ఉన్న మహిళలకు అదనంగా రూ. 50వేలు సాయం అందిస్తాం. అన్ని కుటుంబాలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తాం. 10 లక్షల మంది ఆదివాసీలకు శాశ్వత భూమి



పట్టాలు ఇస్తాం. రాష్ట్రంలోని సీనియర్? సిటిజ న్లకు నెలకు రూ.1250 చొప్పున ఇస్తాం. జుబీన్ గార్గ్ మృతి కేసులో 100 రోజుల్లో న్యాయం చేస్తాం."- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడ'మా పార్టీ మహిళలకు భేషరతుగా నగదు బదిలీ, వ్యాపారానికి ఆర్థిక సాయం చేస్తుంది. బీజేపీ సర్కార్?లాగా మహిళలు మా పార్టీలో సభ్యులుగా ఉండాలని మేము అడగము' అని ఖర్గే అన్నారు.బీజేపీ విచ్చలవిడి అవినీతిఅసో ంలోని బీజేపీ పాల్పడుతోందని ఖర్గే విమర్శించారు. ప్రజలను దోచుకొని, దిల్లీలోని తమ నాయకుల, వారి కుటుంబాల ఖజానాను నింపడానికి అసోం బీజేపీ తన డబుల్ ఇంజిన్‌ను ఉపయోగిస్తోందని దుయ్యబట్టారు .'అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ ఒక 'నకిలీ ముఖ్యమంత్రి'. ఎందుకంటే, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, గిరిజన నాయకుడు సర్బానంద సోవోవాల్‌తో కలిసి పోటీ చేసింది. కానీ ఎన్నికల తర్వాత హిమంత బిశ్వ శర్మ ఆ గిరిజన నేతను తొలగించి అసోం ముఖ్యమంత్రి పీఠాన్ని చేజిక్కించుకున్నారు. శర్మ ప్రభుత్వం ప్రజలను భయపెడుతూ, భయానక వాతావర ణాన్ని సృష్టిస్తోంది. రాష్ట్ర ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తోంది' అని ఖర్గే ఆరోపించారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరపడే ఛాన్స్


**ఇరాన్:** అమెరికా, ఇరాన్ మధ్య గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ప్రకటించింది. అయితే చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలంటే అమెరికా తమ ఐదు షరతులను తప్పనిసరిగా అంగీకరించాలని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ విధించిన షరతుల్లో ప్రధానంగా తమ భూభాగంపై, ముఖ్యంగా ఇంధన వనరులపై అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది.ఇరాన్ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని విధించిన వాణిజ్య, చమురు ఆంక్షలన్నింటినీ పూర్తిగా ఎత్తివేయాలని కోరింది. అలాగే పశ్చిమాసియా ప్రాంతం నుంచి ముఖ్యంగా తమ సరిహద్దుల నుంచి అమెరికా సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలని పేర్కొంది. వీటితోపాటు యుద్ధం



వల్ల దెబ్బతిన్న తమ చమురు బావులు, ఇతర మౌలిక సదుపాయాలకు అమెరికా నష్టపరిహారం చెల్లించాలని, తమ దేశ సార్వభౌ మాధికారాన్ని గౌరవిస్తూ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకూడదని ఇరాన్ తేల్చిచెప్పింది. ఖతార్, ఒమన్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఈ చర్చల్లో మధ్యవర్తిత్వం వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇరాన్ విధించిన ఈ షరతులపై ఇంకా అధికారికంగా స్పందించలేదు.

## ఇరాన్‌తో యుద్ధం తీవ్రం

**ఇరాన్:** ఇరాన్ (తో యుద్ధ వాతావరణం తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా కీలక చర్యలు చేపట్టింది. పశ్చిమాసియాలో తన సైనిక శక్తిని గణనీయంగా పెంచుతూ 3,500 మంది మెరైన్‌లు నావికులతో కూడిన ఓ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను మోహరించింది. ఈ బలగాలు మార్చి 27న మధ్యప్రాచ్యానికి చేరాయని, అమెరికా సెంట్రల్ కమాండ్ ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. యూఎస్ఎస్ ట్రిపోలీ యుద్ధనౌకపై ఈ బలగాలు వచ్చాయని వెల్లడించింది. ఈ బృందంలో దాదాపు 3,500 మంది సైనికులతోపాటు, రవాణా, ఫైటర్ విమానాలు, దాడులకు అవసరమైన ఇతర యుద్ధ సామాగ్రి కూడా ఉన్నాయి. సముద్రం నుంచి నేలపై నుంచి ఏకకాలంలో దాడులు చేయగల సామర్థ్యం ఈ బలగాలకు ఉంది.



వ్యూహాత్మక ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం, పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తీరప్రాంత లక్ష్యాలపై దాడులు చేయడం వంటి వేగవంతమైన ఆపరేషన్ల కోసం ఈ తరహా యూనిట్లను ఉపయోగిస్తారు.

## తమిళనాడు ఎన్నికలు: రెండు చోట్ల దళపతి విజయ్ పోటీ- టీవీకే అభ్యర్థుల జాబితా విడుదల

టీవీకే పార్టీ అధినేత విజయ్ రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తూ, తాను రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. చెన్నైలోని పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల నుంచి విజయ్ బరిలోకి దిగనున్నారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అభ్యర్థుల పేర్లను ప్రకటించిన విజయ్, ఈ ఎన్నికలు తమ పార్టీకి ఎంతో కీలకమని చెప్పారు.ప్రజల కోసం నిజాయితీగా పని చేసే నాయకులనే అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. తమ పార్టీ గుర్తు విజిల్‌కు ఓటు వేయాలని ప్రజలను కోరుతూ, ఇది ఒక కొత్త మార్పు కోసం జరిగే ఎన్నిక అని పేర్కొన్నారు. పార్టీ కీలక నేతలకు కూడా ప్రధాన స్థానాలు



కేటాయించారు. టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ టి.నగర్ నుంచి పోటీ చేయనుండగా, ఆధవ్ అర్జున విల్లివాక్కం నుంచి బరిలోకి దిగనున్నారు. మాజీ మంత్రి కే.ఏ. సెంగొట్టియాన్ గోబిచెట్టిపాళ్యం నుంచి పోటీ చేయనున్నారు. పార్టీ అంతర్గత బృందానికి చెందిన మరికొందరు నేతలకు కూడా ముఖ్య నియోజకవర్గాలు అప్పగించారు.ఈ సందర్భంగా అధికార డీఎంకే కూటమిపై విజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ కూటమి సహజమైనది కాదని, కేవలం ప్రయోజనాల కోసం ఏర్పడిన ప్యాచ్ అప్ అలయన్స్ అని వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల పోరు తమ ప్రజల కూటమి టీవీకే, స్టాలిన్ నేతృత్వంలోని కూటమి మధ్యనే జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చే హామీల విషయానికి వస్తే, యువతకు ప్రాధాన్యం ఇస్తూ పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఇంటర్మీడియట్ నుంచి పీహెచ్‌డీ వరకు చదువుకునే విద్యార్థులకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.20 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.అలాగే డిప్లొమా పూర్తి చేసిన వారికి నెలకు రూ.2,000, గ్రాడ్యుయేట్లకు రూ.4,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని విజయ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కఠిన చట్టాలు అమలు చేసి, శాంతి ఇనిగో ఇరుడయరా జ్‌తో విజయ్ పోటీ నియోజకవర్గాల్లో పోటీ ఆసక్తికరంగా మారింది. అలాగే కొలత్తూర్‌లో టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు నేరుగా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఎదురు నిలవనున్నారు. చెపాక్‌లో ఉదయనిధి స్టాలిన్‌కు వ్యతిరేకంగా కూడా టీవీకే అభ్యర్థి పోటీ చేయనున్నారు. ఈ ఎన్నికల ద్వారా రాజకీయ రంగంలోకి అడుగుపెడుతున్న విజయ్, ప్రజలకు ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA : Printed at BATTU PRINTERS, PLOT NO 30 ROAD NO 2, MADHRA NAGAR MANSURABAD LBNAGAR R R DIST , TELANGANA,
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 ,ROAD NO 2, MADHRA NAGAR, MANSURABAD ,LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876